# గోరంత దీపము

అతను మహా పండితుడు. సందేహం లేదు. అతని విద్వత్తుకు ఘనులే జోహారు చేశారు. ఐతేనేమి? అతని ఆదాయం శూన్యం. సంసారం పెద్దది.

ఉదయం లేచింది మొదలు, ఇల్లాలు ఇంట్లో ఉప్పులేదు, పప్పులేదు—అని చెప్పేది. బిడ్డలు తమకు అది కావాలి ఇది కావాలి—అని అడిగే వారు. పండితులవారికి పాండిత్యం ఉంది కానీ, ప్రపంచజ్ఞానం లేదు.

సంసారం పట్ల విరక్తి పుట్టింది. ఒకరోజున ఎవరికీ చెప్పకుండా ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. తిరిగి తిరిగి ఒక అడవికి చేరాడు. చిన్న కుటీరం నిర్మించుకున్నాడు. రెండు మేకలను సంపాదించాడు. దుంపలు తింటూ, మేకపాలు తాగుతూ కాలక్షేపం చేస్తున్నాడు. రాను రాను ఆ మేకలే అతనికి ఆత్మబంధువులుగా తోచాయి. వాటి పట్ల మమకారం పెరిగింది. క్షణం వాటిని విడిచి మనలేడు.

ఇంతలో ఒక లేడికూన దారి తప్పి వచ్చింది. పండితుడు దాన్ని చూశాడు. జాలితో చేర దీశాడు. దాని అందచందాలకు ముగ్ధుడయ్యాడు. దాన్ని పెంచుతూ, గరిక మేపుతూ, ఆడిస్తూ మేకల సంగతి మరిచిపోయాడు. నిజానికి మేకల కన్నా లేడి అందమయింది కదా!

ఆలనా పాలనా లేక, మేకలు నీళ్ళూ, తిండీ మానేసి కృశించిపోయాయి. వానాకాలం వచ్చే సరికి వయసువచ్చిన లేడి కొండలవైపు పారిపోయింది. లేడిని వెతకడానికి పండితుడూ వెళ్ళాడు. పదిరోజులు కొండా కోనా వెతికాడు. ఎక్కడా లేడి జాడ కానరాలేదు. గుండె దిగులుతో తిరిగి కుటీరానికి వచ్చాడు.

మేకలు రెండూ చచ్చి పడి ఉన్నాయి.

అన్నివిధాలా ఆశోపహతుడైన పండితుడు రోగగ్రస్తుడైనాడు. కదలలేని స్థితి వచ్చింది. సంసారం గుర్తు వచ్చింది. ఏం లాభం? మన సెంత మారినా, ఆయనకు కాలం ముంచు కొచ్చింది. యమదూతలు వాకిట నిలబడ్డారు.

'పెంచదగిన మమత తెంచుకోజెల్లదు
విడనిమోహ మెపుడు పెంచదగదు.'

* * *

అడవిలోనుంచి అపూర్వమైన పుష్పాలు సేకరించి ప్రతిదినమూ భగవంతుని పూజకు తెస్తుండేవాడు సుదాముడు. కూటికి పేదవాడు కానీ, గుణసంపదకు పెద్దవాడు.

నలుగురన్నదమ్ములు రోజూ సుదాముణ్ణి చూస్తుండేవారు. ఎందరడిగినా సుదాముడు "ఈ పూలు భగవంతునికి" అని జవాబిచ్చేవాడు. ఒక్క పువ్వూ ఇతరుల కిచ్చేవాడుకాదు. నలుగు రన్నదమ్ములూ అతనినుంచి పువ్వులు సంపాదించా లని పందెం వేసుకున్నారు.

ఒకనాడు సుదాముడు అడవినుంచి పువ్వులు తెస్తుండగా మొదటివాడు ఎదురు వెళ్ళాడు.

"ఒరే, సుదామా! పువ్వు కొక్క వరహా ఇస్తాను. పూలు ఇస్తావా?" అని అడిగాడు.

సుదాముడు నమస్కరించి తప్పుకు వెళ్ళాడు.

రెండవవాడు ఎదురయ్యాడు. "ఏమోయ్, సుదామా! డబ్బిస్తాను—పూలు ఇస్తావా?" అని అడిగాడు.

సుదాముడు మరో నమస్కారంపెట్టి వెళ్ళిపోయాడు.

మూడవవాడు ఎదురయ్యాడు. "అన్నా, సుదామా! నీవద్ద పువ్వులు తీసుకోవాలని ఆరాట పడుతున్నాను. నీ ఇష్టం—ఒక్కటిచ్చినా చాలు!" అని అడిగాడు.

సుదాముడు మళ్లీ నమస్కరించి, "బాబూ, ఈ పువ్వులు భగవంతుని పూజానిమిత్తం తెస్తున్నాను" అని జవాబుమాత్రం చెప్పి ముందుకు సాగాడు.

నాలుగవవాడు చిన్నవాడు. సుదామునికి ఎదురయ్యాడు. నమస్కారం పెట్టాడు. సుదాముడు కూడా నమస్కారం చేసి నిలబడ్డాడు.

"బాబా! ఒక్కపూవీయవూ? తలలో పెట్టుకుంటాను" అని అడిగాడు. అతని ముద్దు మాటలకు సుదాముడు కరిగిపోయాడు. భగవంతుడు పసిపాపల స్వరూపంకదా అనుకున్నాడు. "బాబూ! నీ కెన్నికావాలో అన్నీ తీసుకో!" అన్నాడు పూలగంప ముందు పెట్టి.

పందెం గెలిచినమాట నిజమే! కానీ, ఆ కుర్రవాని మనస్సు మారిపోయింది. అతి భక్తితో సుదామునికి నమస్కరించి, "బాబా, పద! ఆ పూలతో నేనూ భగవంతుణ్ణి పూజిస్తాను!" అని, సుదామునివెంట బయలుదేరాడు.

మిగతా అన్నదమ్ములు విస్మెరపోయారు.

'మంచిమాట, మనసు మంచితనము చాలు
దేవుడైన లొంగితీరు—నిజము!'

* * *

అతను కోటీశ్వరుడు. అంతకుమించి దాన ధర్మగుణం కలవాడు. ఆనోటా, ఈనోటా దేశ మంతటా అతని దానధర్మాలను గురించి చాలా కథలు ప్రచారమయ్యాయి.

తెలివిగల సోమరులు కొందరు ఆయన ఆశ్రయంలో చేరారు. లేచినదిమొదలు నిద్రపోయే వరకు దానకర్ణుని ప్రశంసిస్తూ కూర్చునేవారు. కోటీశ్వరుడికి మొదట్లో బాగానే ఉంది. కానీ, రాను రాను వెగటయింది. ఎలా వీళ్లను వదిలించుకోవాలో ఆలోచిస్తున్నాడు.

కోటీశ్వరుడు ప్రతి పున్నమిరేయీ పెద్ద విందుచేస్తాడు. ఆనాడు ఎక్కడెక్కడివారూ రావలసిందే! భోజనం చేయవలసిందే! కోరింది అడిగి పుచ్చుకొని వెళ్లవలసిందే! ఇదొక ఆచారంగా జరిగిపోతున్నది.

ఒక పున్నమినాడు తెలివిగల సోమరులబృందం కోటీశ్వరుని చుట్టూ చేరింది. స్తోత్రపఠనం మొదలుపెట్టారు.

"మహాత్మా! ఈ మహాప్రపంచంలో అందరి కన్నా గొప్పవాడు భగవంతుడు. ఆ తర్వాత గొప్ప వారు మీరు!"

"కాదు" అన్నాడు కోటీశ్వరుడు.

"హాస్యానికైనా మీరలా అంటే గుండెపగిలి చచ్చిపోతాం, మహాప్రభో! ఇంతకీ మీకన్నా గొప్ప వాడు ఉన్నాడంటారా?" అని అడిగారు వాళ్ళు.

"ఆ. ఉన్నాడు. నేను కళ్లారా చూశాను. కావాలంటే మీకూ చూపిస్తాను. వస్తారా?" అన్నాడు కోటీశ్వరుడు.

"నిజమా? ఇది కలా? ఐనా పదండి, వెళదాం" అని బృందం అతనివెంట బయలుదేరింది.

కోటీశ్వరుడు వారిని సరాసరి ఒక అడవికి తీసుకువెళ్ళాడు. ఎండలో కట్టెలు కొడుతూ చెమటలు కక్కుతున్న పేదవాణ్ణి చూపి, "ఇతనే" అన్నాడు. "అబద్ధం! మీరు మమ్మల్ని ఎగతాళి చేస్తున్నారు" అన్నారు వాళ్ళు.

కట్టెలు కొట్టేవాడికి వీరెవరో తెలియదు. కోటీశ్వరు డతన్ని సమీపించి, "ఈ ఊళ్లో పెద్ద కోటీశ్వరుడున్నాడని విన్నావా?" అని అడిగాడు.

"ఉన్నారని తెలుసు, బాబయ్యా! ఏమడిగినా ఇస్తారనీ తెలుసండయ్యా" అన్నా డతను.

"మరెందుకిలా ఎండలో కష్టపడతావు? వెళ్ళి ఆయనగారి నడిగి ఇంత తెచ్చుకుని తిని హాయిగా బతకవచ్చుగా?" అని అడిగాడు కోటీశ్వరుడు.

"అయ్యా! నారెక్కల్లో, పిక్కల్లో బల ముంది. మనిషన్నవాడు కష్టపడి పనిచేసి బతకాలండి! కష్టపడి తిన్నగంజి కూడే అమృతమండి. తేరగా వచ్చిందని తింటూ కూర్చుంటే ఇక్కడా, పైనా మనకి దిక్కుఉండదు, బాబూ! దేవుడు సోమరితనం మరిగినవాళ్ళని మన్నించడు" అని చెప్పి, మళ్లీ గొడ్డలి పుచ్చుకుని వెళ్లిపోయా డతను.

"ఇప్పుడు చెప్పండి—నాకన్నా, మీకన్నా అతను ఎంతగొప్పవాడో" అన్నాడు కోటీశ్వరుడు.

నాటితో సోమరులపీడ అతనికి శాశ్వతంగా వదిలిపోయింది.

"మంచి కృషి యనునది మానవాళికొరకు
దేవుడిచ్చినట్టి దివ్యవరము.'

—నార్ల చిరంజీవి